

**బా**లల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నవంబర్ 14న జరిగిన ఒక కార్యక్రమంలో చిన్నారులకు పౌష్టికాహారం అందించే 'బాలామృతం' పథకాన్ని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.

బాలల హక్కులకు సంబంధించిన ఒక పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

చిన్నారుల శారీరక ఎదుగుదల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన పౌష్టికాహార ప్యాకెట్లను ముఖ్యమంత్రి వేదికపై పలువురు బాల బాలికలకు అందజేశారు.

# 'బాలామృతం' పథకం ప్రారంభం!

'బాల సూర్యరత్న' అవార్డు గ్రహీత ఘన సంతోషిణికి ముఖ్యమంత్రి జ్ఞాపిక బహూకరించింది. ఆ బాలికను ఎత్తుకుని ముద్దాడారు. మరికొందరు బాలలను కూడా 'బాల సూర్యరత్న' అవార్డులతో సి.ఎం. సత్కరించారు.

రకరకాల సంప్రదాయ దుస్తులతో బాలలు ప్రదర్శించిన పలు కార్యక్రమాలు చూపరులను మైమరపించాయి.

చివరగా వేదికపై బాల అవార్డు గ్రహీతలను ప్రశంసిస్తూ చెప్పిన విషయాలు శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి మాటల్లో..... "భవిష్యత్తులో ఏం చేయాలనుకుంటున్నారో ఆలోచించుకోవాలి. ఏ అంశంలో రాణించగలుగుతామో ముందుగానే సొంతంగా నిర్ణయించుకోవాలి. చదువు అనేది కేవలం ఉద్యోగం చేయడానికే కాదు. కష్ట కాలంలో ఎదురైన సమస్యల్ని ఎదుర్కొనేందుకు ఉపయోగపడేదిలా ఉంటుందని గుర్తించాలి" అని సూచించారు.

"భారత్, చైనా దేశాలకు చెందిన విద్యార్థులు తెలివైనవారు. కష్టపడతారు. వారితో పోటీ పడకపోతే మన అమెరికా వెనుక పడిపోతుందని ఆ దేశ అధ్యక్షుడు ఒబామా ఓ సందర్భంలో పేర్కొన్నారు. నడిచే అనేక విమానాలకు మన హైదరాబాద్ నుంచే వాతావరణం తదితర అంశాలలో ఆదేశాలు వెడుతున్నాయి.






ఇలా సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా వినియోగించుకుని మీరుముందుకు వెళ్లాలి. ఇక ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టుకు రూ. 77 కోట్లు మంజూరు చేస్తున్నాం" అని తెలిపారు.

ప్రాథమిక విద్యాశాఖ మంత్రి శ్రీ శైలజానాథ్ మాట్లాడుతూ "వచ్చే ఏడాది నుంచి పదవ తరగతిలో క్రీడలకు మార్కులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం" అని చెప్పారు.

రాష్ట్ర మంత్రులు శ్రీ దానం నాగేందర్, శ్రీ ముఖేష్ గౌడ్, శ్రీమతి సునీతా లక్ష్మా రెడ్డి, శ్రీ పితాని సత్యనారాయణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

*– రాజఫణి. వి*

## కాగితం పూలు...

అవడానికి కాగితం పూలే
సువాసన లేనివే
అయితేనేం రెమ్మల చివర్న కూర్చుని
గాలికి సయ్యాటలాడుతుంటాయి
దారెంట వెళ్లేవాళ్ళ కళ్లని కట్టిపడేస్తుంటాయి
ఓపిగ్గా కోసి దండ గుచ్చేవాళ్ళుండరు
దేవుడికి అలంకరించి
తాదాత్మ్యాన్నొందేవారుండరు
సిగలో తురుముకుని
నును సిగ్గులు ఒలకబోసేవారుండరు
అయితేనేం.. మనుషుల్లా
సువాసనలేనే పూలని చూసి కుళ్ళిపోవు
తమ జన్మ నిరర్థకమైనదని కుమిలిపోవు
ఒక్క రోజైనా చూసేవాళ్ల కనులపండువగా నిలిచి
గర్వంగా నేలరాలతాయి
అది చాలదూ వాటి జన్మ ధన్యతకు!

*– ప్రతాప వెంకట సుబ్బారాయుడు*